అభ్యర్థులు ఖరారు

- ఆసక్తికరంగా మానుకోట పోరు
- బీఆర్ఎస్ అభ్యర్థికి ప్రజల్లో మంచి ఇమేజ్
- ప్రచారంలో దూసుకెళ్తున్న ఎంపీ మాలోత్ కవిత

మహబూబాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తుండడంతో ప్రధాన పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటిస్తున్నాయి. మహబూబాబాద్ పార్లమెంట్ స్థానానికి ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు ఖరారు అయ్యారు. బీఆర్ఎస్ నుంచి సిట్టింగ్ ఎంపీ మాలోత్ కవిత పేరును బీఆర్ఎస్ పార్టీ అధినేత ఇప్పటికే అధికారికంగా ప్రకటించారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ నుంచి కేంద్ర సహాయక మాజీ మంత్రి పోరిక బలరాంనాయక్, బీజేపీ నుంచి మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్ పేర్లను ఆయా పార్టీలు ప్రకటించాయి. ప్రధాన పార్టీల అభ్యర్థులు ఖరారు కావడంతో మానుకోట పార్లమెంట్ పరిధిలో పోరు ఆసక్తిగా మారింది. ఇప్పటికే సిట్టింగ్ ఎంపీ అభ్యర్థి కవిత బీఆర్ఎస్ పార్టీ నుంచి మరోమారు టికెట్ దక్కడంతో ఆమె ఇప్పటికే చురుకుగా మండలాలను చుట్టేస్తుంది. మరిపెడ, కురవి, సీరోలు, డోర్నకల్, నర్సింహులపేట, ములుగు, మహబూబాబాద్ పట్టణం, మహబూబాబాద్ రూరల్ ప్రాంతాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించి భవిష్యత్ ప్రణాళికలను రూపొందించారు. మూడు ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో బీఆర్ఎస్ అభ్యర్థి మాలోత్ కవితకే ప్రజల్లో మంచి పేరుందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కాగా, 2019 పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీల వారీగా వచ్చిన ఓట్ల వివరాలు ఇలా ఉన్నాయి. పార్లమెంట్ పరిధిలో మొత్తం 14,23,351 ఓట్లు ఉండగా, 9,83,707 ఓట్లు పోలయ్యాయి. ఇందులో బీఆర్ఎస్ అభ్యర్థి మాలోత్ కవితకు 4,62,109 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థికి 3,15,446 ఓట్లు, బీజేపీ అభ్యర్థి హుస్సేన్‌నాయక్‌కు 25,487 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థి బలరాంనాయక్‌పై మాలోత్ కవిత 1,46,663 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో ములుగు, నర్సంపేట, మహబూబాబాద్, డోర్నకల్, ఇల్లందు, పినపాక, భద్రాచలం అసెంబ్లీ స్థానాలున్నాయి. ఇందులో నర్సంపేట మినహాయిస్తే మిగిలిన ఆరు నియోజకవర్గాలు ఎస్టీ స్థానాలు. మూడు ప్రధాన పార్టీలు ఎస్టీ లంబాడా వర్గానికి చెందిన వారికే టికెట్లు ఇచ్చాయి.

ప్రచారంలో దూసుకుపోతున్న బీఆర్ఎస్ అభ్యర్థి

ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ అభ్యర్థి మాలోత్ కవిత ప్రచారంలో దూసుకెళ్తున్నారు. నిత్యం పార్టీ నాయకులు, శ్రేణులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించి కార్యాచరణను రూపొందించుకొని ముందుకెళ్తున్నారు. గ్రామాల్లో ప్రజల ఇంటికి వెళ్లి వచ్చే ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరుతున్నారు. మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులతో పోలిస్తే బీఆర్ఎస్ అభ్యర్థి మాలోత్ కవితకు వ్యక్తిగతంగా మంచి ఇమేజ్ ఉంది. ఆమె 2009 నుంచి 2014వరకు మహబూబాబాద్ ఎమ్మెల్యేగా, 2019 నుంచి ప్రస్తుతం వరకు మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యురాలిగా కొనసాగుతున్నారు. ఇప్పటికే మిగతా పార్టీల కంటే బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ప్రచారంలో ముందున్నారు.

ప్రశ్నించే గొంతుకనవుతా..

- మీ ఇంటి ఆడబిడ్డగా ఆశీర్వదించండి
- మహబూబాబాద్ ఎంపీ కవిత

నర్సింహులపేటలో మాట్లాడుతున్న ఎంపీ కవిత

నర్సింహులపేట, మార్చి 14 : కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు ప్రజల పక్షాన పోరాటం చేస్తానని, ప్రశ్నించే గొంతుకనవుతానని మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత అన్నారు. గురువారం మండలకేంద్రంలో మండల అధ్యక్షుడు మైదం దేవేందర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యకర్తలను గుండెల్లో పెట్టుకొని చూసుకుంటానన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం కోసం అలవిగాని హామీలు ఇచ్చిందని, వాటిని అమలు చేసే వరకు పోరాటం చేస్తానన్నారు. పార్టీలకు అతీతంగా ప్రజలు, కార్యకర్తలు తనకు మద్దతు తెలుపుతున్నారని చెప్పారు. కార్యకర్తలు మనోధైర్యంతో పోరాటంలో ముందు ఉండాలన్నారు. కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలను సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేయకుండా ప్రజలు ఇబ్బందిపెడుతున్నట్లు చెప్పారు. డిసెంబర్ 9న రైతుబంధు ఎకరానికి రూ.15వేలు, రుణమాఫీ రూ.2లక్షలు, రూ.4వేల పింఛన్, గృహలక్ష్మిలో పేద మహిళలకు రూ.2500, కౌలు రైతులకు ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని చెప్పిన సీఎం ఇప్పటి వరకు ఒక్క పథకం కూడా సక్రమంగా అమలు చేయలేదన్నారు. ఆరు గ్యారెంటీల్లో 13 పథకాలు ఉన్నాయని, వాటిని అమలు చేసేవరకు ప్రజల తరఫున పోరాటం చేస్తానన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో మీ ఇంటి ఆడబిడ్డగా ఆశీర్వదించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ మాట్లాడుతూ.. రైతుబంధు కోసం నిల్వ ఉంచిన డబ్బులను రైతుల బ్యాంకుఖాతాలోల వేయకుండా కాంట్రాక్టుల పేరుతో మంత్రులు రూ.7వేల కోట్లు మళ్లించారని, 10 శాతం పర్సంటేజీ ఇస్తేనే చేసిన పనులకు సంబంధించిన బిల్లులు చెల్లిస్తున్నారని ఆరోపించారు. దళితబంధు రూ.12 లక్షలు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్, ఇప్పటి వరకు ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. డోర్నకల్ నియోజకవర్గంలోని ఆకేరు, పాలేరు, మున్నేరు వాగులపై 46 చెక్‌డ్యాంలు నిర్మించామని, ఎప్పుడూ నీటితో కళకళలాడే వాగులు.., ఇప్పుడు చుక్కనీరు ఎండిపోయాయన్నారు. నల్లగొండ జిల్లాకు చెందిన మంత్రి వెంకట్‌రెడ్డికి అవగాహన లేదని, కాళేశ్వరం ప్రాజెక్టు నీరు గోదావరిలోకి వదిలి మేడిగడ్డ కూలిపోయేలా కుట్రలు పన్నుతున్నారన్నారు. పదేళ్లుగా అధికారం లేకపోవడంతో 'దొరికింది తిందాం.. తాగుదాం' అనే రీతిలో మంత్రులు, ఎమ్మెల్యేలు వ్యవహరిస్తున్నారని అన్నారు. మేడిగడ్డ నీటిని వృథాగా వదల కుండా పంపింగ్ చేస్తే ఇప్పుడు చెరువులు, కుంటల్లో పుష్కలంగా నీరు వచ్చేదని, వాటాల ప్రకారం నీరిచ్చే పరిస్థితి వచ్చేది కాదన్నారు. ప్రజల కోసం నిత్యం అందుబాటులో ఉండే కవితను ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జాటోత్ దేవేందర్, నాయకులు మధుసూదన్‌రెడ్డి ఎంపీటీసీలు, నాయకులు గుగులోత్ రవి, నాయకీ, అనీల్, మధురెడ్డి, ఖాజామియా, వెంకట్‌రెడ్డి, రమేశ్, వెంకన్న, రమేశ్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, కిషన్‌నాయక్, వంశీ, చంద్రశేఖర్, రామన్న, వెంకటేశ్వర్లు, వీరస్వామి పాల్గొన్నారు.

సమావేశానికి హాజరైన కార్యకర్తలు

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ నెమురుగొమ్ముల సుధాకర్‌రావు అంత్యక్రియల్లో పాల్గొన్న బీఆర్ఎస్ కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి వినోద్‌కుమార్, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఇతర నాయకులు

పసుపు సాగులో ఆధునిక పద్ధతులు పాటించాలి

కేసముద్రం, మార్చి 14: పసుపు సాగు చేసే రైతులు ఆధునిక పద్ధతులు పాటించి, అధిక దిగుబడులు సాధించాలని పసుపు పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త మహేందర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతువేదికలో నిజామాబాద్‌లోని పసుపు పరిశోధనా కేంద్రం కమ్మరపల్లి మల్యాల హెచ్ఆర్ఎస్ సహకారంతో పసుపు పంట సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పసుపు సాగు విస్తీర్ణం తగ్గుతున్నదని, రైతులు దృష్టి సారించాలన్నారు. శాస్త్రవేత్తలు శ్రీనివాస్, భాస్కర్, ఉద్యాన శాఖ అధికారి మరియన్న, రైతులు జైపాల్‌రెడ్డి, బొబ్బాల యాకూబ్‌రెడ్డి, గంట దామోదర్‌రెడ్డి, పొదిల నర్సింహారెడ్డి, ఆకుల సుధాకర్, గండి శ్రీనివాస్, కుమారస్వామి, సత్యనారాయణ, తోట నాగయ్య పాల్గొన్నారు.

ప్రారంభించిన గ్రంథాలయంలో యువతీ యువకులు

గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కురవి, మార్చి 14 : నేటి పోటీ ప్రపంచంలో యువత ముందుకు సాగాలంటే విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి పీ రామారావు, మహబూబాబాద్ పోస్టల్ శాఖ సహాయ పర్యవేక్షకుడు ఎల్ సైదానాయక్ అన్నారు. కురవి మండలం రేకులతండా గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం యువ భారత్ గ్రామ గ్రంథాలయాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. యువత గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విశ్రాంత ఉపాధ్యాయులు వెంకట్రాం నర్సయ్య, ఉపాధ్యాయులు మనోహర్, గోవర్ధన్, ప్రతాప్, ధనలక్ష్మి, బిక్కు, యువభారత్ యూత్ అధ్యక్షుడు చంద్యానాయక్, లాలనాయక్, శంకర్‌నాయక్, బిక్కు పాల్గొన్నారు.

పాలకుర్తి దేవస్థాన కమిటీ డైరెక్టర్‌కు సన్మానం

తొర్రూరు, మార్చి 14 : పాలకుర్తి సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి దేవస్థాన కమిటీ డైరెక్టర్‌గా మండలంలోని చెర్లపాలెంకు చెందిన తంగళ్లపల్లి సోమసత్యనారాయణా చారిని ఘనంగా సన్మానించారు. డివిజన్ కేంద్రంలోని శ్రీమాత గోవిందమాంబా సమేత వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో గురువారం ఆలయ శాశ్వత నిధి నిర్వహణ కమిటీ సభ్యులు శాలువా కప్పి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ శాశ్వత నిధి నిర్వహణ కమిటీ అధ్యక్షుడు కల్లూరినాగేంద్రాచారి, ప్రధాన కార్యదర్శి పూర్ణాచారి, ఉపాధ్యక్షుడు సదా నందాచారి, వెంకటాచారి, సహాయ కార్యదర్శి రాగి శ్రీనివాసాచారి, గజ్జెల వెంకటేశ్వర్లు, ఆలయ అర్చకులు విక్రమ్‌శర్మ, భాస్కరాచారి పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడి ఆత్మహత్యాయత్నం

కురవి, మార్చి 14 : చీటింగ్ కేసులో పోలీసులు అరెస్టు చేస్తారని తెలుసుకుని పురుగు మందు తాగి కాంగ్రెస్ నాయకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండలంలోని తాట్యాతండాలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బాపట్ల పోలీస్ స్టేషన్‌లో రూ.2 లక్షల నగదు బదిలీ విషయమై తాట్యాతండాకు చెందిన రమేశ్‌పై చీటింగ్ కేసు నమోదైంది. బాపట్ల పోలీసులు గురువారం తెల్లవారుజామున తండాకు వచ్చి రమేశ్‌ను అరెస్టు చేసే సమయంలో తాను రానని మొండికేశాడు. తర్వాత కురవి పోలీసుస్టేషన్‌కు కుటుంబసభ్యులతో కలిసి వచ్చాడు. కేసు వివరాలను బాపట్ల పోలీసులు కురవి ఎస్సై గోపికి వివరించారు. స్టేషన్ నుండి బయటకు రాగానే బాపట్ల పోలీసులు మరోసారి అరెస్టు చేసే క్రమంలో భార్య చేతి లో ఉన్న పురుగులమందును తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అతడిని వెంటనే మహబూబాబాద్ ఏరియా వైద్యశాలకు తరలించారు.

ఇంటి నిర్మాణాలకు అనుమతి ఇవ్వాలని ధర్నా

కేసముద్రం, మార్చి 14: బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసిన స్థలంలో ఇండ్ల నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట పలు గ్రామాల ప్రజలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేసముద్రం విలేజ్, కేసముద్రం స్టేషన్, భూక్యారాంతండాకు చెందిన 45 మంది నిరుపేదలకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇంటి స్థలాలు మంజూరు చేసి, స్థలం కేటాయించి హద్దులు ఏర్పాటు చేసి ఇచ్చినట్లు తెలిపారు. కాంగ్రెస్ పభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం అందించిన స్థలంలో ఇంటి నిర్మాణాలు చేపడుతుంటే హద్దులు ఏర్పాటు చేసి ఇచ్చిన తహసీల్దార్ వచ్చి నిర్మాణాలు నిలిపివేస్తున్నాడని ఆరోపించారు. ఇంటి నిర్మాణాల విషయంలో పలుమార్లు కలెక్టర్‌కు వినతి పత్రాలు అందించినా పట్టించుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ నాయకులు ఒత్తిడితోనే తహసీల్దార్ ఇంటి నిర్మాణాలు నిలిపివేశారని అన్నారు. తహసీల్దార్ కాంగ్రెస్ పార్టీ ఏజెంట్‌గా పని చేస్తున్నాడని ఆరోపించారు. ఎండీ సోని, చిన్ని, వాంతి, బద్రి, విజయ, కవిత, వాంకుడోత్ వెంకన్న, వెంకన్న, రమేశ్, వెంకన్న పాల్గొన్నారు.

మహనీయుడు మార్క్స్

తొర్రూరు, మార్చి 14 : ప్రపంచదేశాల్లో శ్రమ చేసే వర్గం ప్రయోజనాలను కాపాడడానికి కమ్యూనిజం అనే సిద్ధాంతాన్ని తెచ్చిన మహనీయుడు మార్క్స్ అని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. గురువారం డివిజన్ కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద కారల్ మార్క్స్ 141వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి ముంజంపల్లి వీరన్న, సంయుక్త మండలాల కార్యదర్శి నవీన్, లక్ష్మయ్య, రాములు, వెంకన్న, బాలు, మహేశ్, యాకయ్య, సంతోష్ పాల్గొన్నారు.

16న జాతీయ లోక్ అదాలత్

మహబూబాబాద్ రూరల్, మార్చి 14 : జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 16న (శనివారం) జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి పసుపులేటి చంద్రశేఖర ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కక్షిదారులు తమ కేసులను రాజీ చేసుకోవాలని సూచించారు.

కోదండ రామస్వామి ఆలయ కమిటీ


కృష్ణారెడ్డిని సన్మానిస్తున్న కమిటీ

బయ్యారం, మార్చి 14 : మండల కేంద్రంలోని శ్రీ కోదండ రామస్వామి ఆలయ కమిటీని గురువారం ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా డాక్టర్ కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కొల్లా వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా వేమిశెట్టి కోటేశ్వరావు, వేం యాకూబ్ రెడ్డి, ఎల్లావుల మల్లయ్య, మధుసూదన్‌రెడ్డి, పగడాల శ్రీను, కోశాధికారిగా కొల్లా బోస్, మారెం యాకూబ్‌రెడ్డి (వైఎస్), గౌరవ సలహాదారుగా పీ రాజు, పలువురు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పది పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ డేవిడ్

మహబూబాబాద్, మార్చి 14 : పదో తరగతి పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ ఎం డేవిడ్ విద్యా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పదో తరగతి పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మా ట్లాడుతూ.. ఈ నెల 18 నుంచి ఏప్రిల్ 2 వరకు పరీక్ష జరిగే 49 సెంటర్లలో అన్ని వసతులు కల్పించాలన్నారు. 49 సెంటర్లలో 4,239 బాలురు, 3,952 బాలికలు పదో తరగతి పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా ఏ ర్పా ట్లు చేయాలన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు తీసుకురావొద్దన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, త ప్పులకు తావులేకుండా చర్యలు చేపట్టాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో శుభ్రతను పాటించాలన్నారు. కేంద్రాలకు అతి సమీపంలో ఉన్న జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని ఆదేశించారు. విద్యార్థులకు తాగునీరు, టాయిలెట్స్ సౌకర్యాలు ఉండేలా చూడాలన్నారు. పోలీస్ ఎస్కార్ట్‌తో ఉన్న వాహనాల్లో మాత్రమే ప్రశ్న పత్రాలను సెంటర్లకు తరలించాలన్నారు. అలాగే పరీక్ష కేంద్రాలకు 100 మీటర్ల దూరం వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. గుంపుగుంపులుగా ఉండే వారిపై పోలీసు లు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రతి సెంటర్ వద్ద ఇద్దరు ఏఎస్సైలు, సిబ్బంది బందోబస్తులో ఉంటారని, ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి సందేహాలున్నా సెల్ నంబర్లు 9849761012, 949055 6656కు ఫోన్ చేయాలన్నారు. సమీక్షలో డీఈవో రామారావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్లకు అనుమతి లేదు

మహబూబాబాద్ రూరల్, మార్చి 14: 18వ తేదీ నుంచి నిర్వహించనున్న పదో తరగతి పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లకు అనుమతి లేదని జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు అన్నారు. గురువారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఇన్విజిలేటర్లు, స్క్వాడ్ బృందాలకు పరీక్షల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పది పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు సీఎస్‌లు, డీవోలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మాల్ ప్రాక్టీస్ అవకాశం లేకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. పరీక్షా కేంద్రానికి విద్యార్థులు గంట ముందుగానే వచ్చేవిధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మందుల శ్రీరాములు, సంతోష్ పాల్గొన్నారు.

దడువాయి కమిటీ అధ్యక్షుడిగా మంగీలాల్

కేసముద్రం, మార్చి 14: దడువాయిల సంఘం అధ్యక్షుడిగా అంగోత్ మంగీలాల్ ఎన్నికయ్యారు. గురువారం కేసముద్రం మార్కెట్ యార్డులో జరిగిన సంఘం సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా కొడారి నాగేంద్రబాబు, ప్రధాన కార్యదర్శిగా సింగిరెడ్డి కృష్ణ, సహాయ కార్యదర్శులుగా బట్టు సుధాకర్, సంగిరెడ్డి వెంకట్‌రెడ్డి, కోశాధికారిగా బేతి రాజు, కార్యవర్గ సభ్యులుగా అరుణ్‌కుమార్, హరీశ్, మధుకర్, రమేశ్‌ను ఎన్నుకున్నారు.

పల్లెల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే కోరం కనకయ్య

రోడ్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న కనకయ్య

బయ్యారం, మార్చి 14 : పల్లెల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మండలంలోని ఇసుకమేది, మిర్యాలపెంట, వెంకటాపురం, టేకులగూడెం, కొత్తూరు, రామచంద్రాపురం గ్రామాల్లో సుమారు రూ.కోటి ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణానికి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో నివసించే ప్రజలకు సకల సౌకర్యాలకు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. ముఖ్యంగా ఏజెన్సీ గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ప్రతి గ్రామంలో రహదారులు నిర్మిస్తామన్నారు. ఎంపీటీసీ సోమేశ్, అధ్యక్షులు కంబాల ముసలయ్య, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు రామ్మూర్తి, రాసమళ్ల నాగేశ్వరరావు, వెంకటపతి, వీరారెడ్డి, గోపాల్ , రాజు, రవి, బయ్యారం టౌన్ మాజీ సర్పంచ్‌లు వెంకటేశ్వర్లు, రామూనాయక్, రమేశ్, లక్ష్మణ్‌రావు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాదం కోసం పార్కులను వినియోగించుకోవాలి : ఎమ్మెల్యే

పార్కును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

మహబూబాబాద్, మార్చి 14 : మానసిక ఆహ్లాదం కోసం ప్రజలు పార్కులను ఉపయోగించుకోవాలని ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్ సూచించారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డులో 14వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మించిన మినీ పార్కును మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మున్సిపాలిటీని అన్ని రకాల అభివృద్ధి చేస్తామన్నారు. నిత్యం ఎన్నో అవరోధాలను ఎదుర్కొని జీవితాలు సాగిస్తున్న ప్రతి ఒక్కరూ సాయంత్రం సమయంలో భార్యా పిల్లలతో పార్కులకు వచ్చి విశ్రాంతిని పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నోముల రవీందర్‌యాదవ్, డీఈ ఉపేందర్, సీపీఐ నాయకులు విజయ్, అజయ్, కౌన్సిలర్ ఎండీ సలీం, పోతరాజు రాజు, ఎడ్ల రమేశ్, కోడి శ్రీను, నిమ్మల శ్రీను, పెరుగు కుమార్, జానీ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

CHANGE OF NAME
★I, CHOUTAPALLY GOUTHAMI, D/o. CHOUTAPALLY RAJENDER (Old Name), R/o. 16-8-268, Abhanikunta, Warangal Dist., T.S., I have changed my name as PITTA SUDHA, W/o. PITTA SATHISH (New name).
NTW-00

CHANGE OF NAME
★I, SHANIGARAM NARSIMHA SWAMY (New Name), previously called SENIGARAM NARSIMHASWAMY (Old Name), R/o. H.No. 4-4-92/1, Kumarpally, Hanamkonda, Hanumakonda Dist.-506001, T.S., India, and solemnly declare.
NTW-00

VEHICLES FOR SALE

★TS06UB 6128 MARUTI RITZ Diesel-P Galif Mazam Mohammad 2016, AP25AD 3601 JOHN DEERE 5310 HARVESTER Chiranjeevi Reddy Yella 2010, Auction Date: 16-03-2024, Venue: Shriram Auto Mall India Ltd., Bollikunta, Warangal. Cont: Shriram Finance Limited, H.No. 4-316, 4-317, 4-318, Ground Floor, Parkal, Warangal. Cell: 9704123166, 9989766426.
NTW-14028

VEHICLES FOR SALE
★TS24T 7904 APE Xtra LDX BS6 Diesel Venkateshwarlu Bejjala 2020, TS24T 7352 APE Xtra LDX BS6 Diesel Baggi Raju 2020, TS24H 8819 SONALIKA DI 745 Ramdhan Mudu 2023, Auction Date: 16-03-2024, Venue: Shriram AutoMall India Ltd. Punnel Cross Road, Bollikunta, Warangal. Cont: Shriram Finance Limited, H.No. 15-1-237, 2nd Floor, Opp: L.B. College, Mulugu Road. Cell: 9849981545, 9966196881.
NTW-14028

CHANGE OF NAME
I, KUNDARAPU SARALADEVI (New Name), previously called ELUKURTHI SARALA DEVI (Old Name), R/o. H.No. 31-3-759, Parimala Colony, Waddepally, Hanamkonda, Hanumakonda Dist.-506370, T.S., India. solemnly declare.

HMDA & RERA PLOTS
★3-5 సంవత్సరాలలో Future City
బీబీనగర్‌లో 200 ఎ|| AIIMS హాస్పిటల్ దగ్గర్లో HMDA & RERA ప్లాట్లు 60% లోన్‌తో గేటెడ్ కమ్యూనిటీలో కలవు: 8109994456.
NT-320386

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
9182777557
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565

కల్యాణ 'వీర'భద్రుడి పారువేట

- పురాతన చక్రాలతో కూడిన నేరడ బండికి స్వాగతం
- మొక్కులు చెల్లించుకున్న రుద్రారపు వంశస్తులు

ఎడ్లబండికి స్వాగతం పలుకుతున్న ఆలయ చైర్మన్, ఈవో

కురవి, మార్చి 14 : భద్రకాళీ సమేత వీరభద్రస్వామి కల్యాణ బ్రహ్మోత్సవా ల్లో భాగంగా ఎనిమిదో రోజు గురువారం సాయంత్రం కల్యాణ వీరభద్రుడు పారు(మృగ)వేటను నిర్వహించారు. ఆలయం నుంచి ప్రత్యేక శావలో అశ్వవాహనంపై స్వామివారు వేంచేసి ఉండగా, వాహనకారులు భజంత్రీలతో పరుగులు తీశారు. ఆలయం నుంచి బయలెల్లిన శావ ఆనవాయితీ ప్రకారం గ్రామ పొలిమేరలో ఉన్న బీఆర్ఎస్ నాయకుడు బాదె నాగయ్య వీధి వరకు చేరుకుంది. బాదె నాగయ్య ఆలయ ఈవో, చైర్మన్, ధర్మకర్తలు, పూజారులను సత్కరించారు. స్వామివారికి భక్తులు గుమ్మడికాయలు, కొబ్బరికాయలు కొట్టి నీళ్లు పోసి స్వాగతం పలికారు. ధర్మకర్త బాలగాని శ్రీనివాస్ గౌడ్, గ్రామపెద్దలు బాదె వీరభద్రం, అవిరె మోహన్‌రావు, ఉమేశ్, యాకరాజు, బాదె సోమయ్య, తొడుసు సోమయ్య పాల్గొన్నారు.

నేరడ ఎడ్లబండికి స్వాగతం..

ముందుగా కురవి మండలం నేరడ గ్రామానికి చెందిన రుద్రారపు వంశస్తులు తీసుకొచ్చిన ఎడ్ల బండికి ఆలయ చైర్మన్ కొర్ను రవీందర్‌రెడ్డి, ఆలయ ఈవో సత్యనారాయణలు స్వాగతం పలికారు. నేరడ ఎడ్ల బండి ఆలయం చుట్టూ తిరుగిన తర్వాతనే ఎడ్లబండ్లు తిరుగుతాయి. ఈ కార్యక్రమంలో రుద్రారపు వంశస్తులు రుద్రారపు వేలాద్రి, సోమయ్య, శ్రీనివాస్, వీరేందర్, యాదగిరి, సోమయ్య, వీరభద్రం, సూర్యనారాయణ, వీరన్న, యాదగిరి, వినయ్, శంకర్, శ్రీపాల్, శశిదర్, సోమయ్య, ప్రసాద్ పాల్గొన్నారు. అనంతరం స్వామివారి కల్యాణ బ్రహ్మోత్సవాలకు గుర్తుగా అంకురార్పరణ రోజున ధ్వజస్తంభానికి వేలాడదీసిన నందితో కూడిన పటాన్ని పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఉద్వాసన పలికారు. అనంతరం రాత్రి 10 గంటలకు బసవముద్దతో కార్యక్రమాలు ముగిశాయి.

సేవా దృక్పథం అభినందనీయం..

నెల్లికుదురు, మార్చి 14 : పాఠశాలకు రూ. 6,500తో బీరువా, స్టీల్ గ్లాసులు, విద్యార్థుల తల్లులకు చీరెలను పంపిణీ చేసిన ఉపాధ్యాయురాలు మహ్మద్ నాగుమీర సేవా దృక్పథం అభినందనీయమని ప్రధానోపాధ్యాయుడు నరేందర్ అన్నారు. మండలంలోని పార్వతమ్మగూడెం ప్రాథమికోన్నత పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న మహ్మద్ నాగుమీర తన భర్త అబ్బాస్ జ్ఞాపకార్థం పాఠశాలకు బీరువా, విద్యార్థులకు స్టీల్ గ్లాసులు, విద్యార్థుల తల్లులకు గురువారం చీరెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చీరెలు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయురాలు

మహిళల భద్రతే షీ టీం లక్ష్యం

మహబూబాబాద్, మార్చి 14 : మహిళలకు భద్రత కల్పించడమే షీ టీం బృందాల లక్ష్యమని ఎస్సై సునంద అన్నారు. ఎస్పీ ఆదేశాలతో అడిషనల్ ఎస్పీ చెన్నయ్య ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో షీ టీం బృందం ఎస్సై సునంద మాట్లాడుతూ.. మహిళలకు భద్రత కల్పించేందుకు అడిషనల్ డీజీపీ స్వాతిలక్రా షీటీంలను ఏర్పాటు చేశారని అన్నారు. ఆపద సమయంలో మహిళలు 100, షీటీం నంబర్లకు డయల్ చేయాలన్నారు. ప్రత్యేకంగా చిన్న పిల్లలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పై అవగాహన కల్పించాలని తెలిపారు. షీ టీం బృందాల వాట్సాప్ నంబర్లు 8712 656935, 7901142009కు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో షీ టీం ఎస్సై ఆనందం, అధ్యాపకులు పాల్గొన్నారు.

నర్సింహులపేట: నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్

సుధాకర్‌రావుకు ఘన నివాళి

నర్సింహులపేట, మార్చి 14 : మాజీ ఎమ్మెల్యే డాక్టర్ నెమురుగొమ్ముల సుధాకర్‌రావు అనారోగ్యంతో మృతి చెందగా, గురువారం మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుజేశారు. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో చేసిన అభివృద్ధిని వివరించారు. పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు ఉన్నారు.

తొర్రూరులో నాయకులు..

తొర్రూరు: నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్‌రావు అనారోగ్యంతో మృతి చెందారు. కాగా, గురువారం తొర్రూరులోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పార్టీ నాయకులు పుష్పాంజలి ఘటించి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు, జడ్పీటీసీ శ్రీనివాస్, మాజీ ఎంపీపీ కర్నె సోమయ్య మాట్లాడుతూ సుధాకర్‌రావు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఈ ప్రాంత అభివృద్ధికి చేపట్టిన సేవలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ అనుమాండ్ల ప్రదీప్‌రెడ్డి, కార్యదర్శులు ప్రమోద్, శ్రీనివాస్, వెంకన్న, జైసింగ్, ఆశయ్య, పినాకపాణి, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పేదల హక్కుల సాధనే కమ్యూనిస్టుల లక్ష్యం

కురవి, మార్చి 14 : పేదలకు ఇంటి స్థలాలు, ఇండ్లు, ఉపాధి సాధన కోసం నిజాయితీగా పోరాటాలు చేసేది కమ్యూనిస్టులు మాత్రమేనని సీపీఐ జిల్లా కార్యదర్శి బి విజయసారధి అన్నారు. కురవి శివారులో సీపీఐ ఆధ్వర్యంలో వేసిన గుడిసె వాసుల కాలనీలో గురువారం జెండా పండుగను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో వేసిన గుడిసెలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం విధానాల కారణంగా నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని, దేశంలో పేద, మధ్య తరగతి వారిపై పన్నులు మోపి కార్పొరేట్లకు సంపద దోచిపెడుతున్నారన్నారు. మత రాజకీయాలతో ప్రజలను మాయ చేస్తున్న మోదీకి గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి, మండల కార్యదర్శి కరణం రాజన్న, సమ్మయ్య, తురక రమేశ్, కన్నె వెంకన్న, దూదికట్ల సారయ్య, ఉప్పలయ్య, బూర్గుల కృష్ణ, వీరన్న పాల్గొన్నారు.